# సింగిల్ పేజీ కథలు

## అలవాటులో పొరపాటు



నడుచుకుంటూ వెళ్తున్న బాలూకు రోడ్డు పక్కన పడున్న పర్సు కనిపించింది. అటు ఇటు చూశాడు ఎవరూ కనిపించలేదు. వంగి పర్సు అందుకుని చూశాడు. అందులో డబ్బు వుంది. జేబులో పెట్టుకుని తన రూం కేసి నడిచాడు.

రూంకొచ్చాక పర్సులో ఏమేమి వున్నాయో చూశాడు. రెండు వేలు డబ్బు, క్రెడిట్ కార్డ్స్, ఎ.టి.ఎం.కార్డ్స్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ కొన్ని విజిటింగ్ కార్డ్స్ వున్నాయి.

నిజానికి బాలూకు అర్జంటుగా ఇరవై వేల దాకా కావాలి. పొద్దుట్నుండి పరిచయం వున్న వాళ్ళ అందర్నీ రెండు మూడు వందలు అప్పు అడిగి అది కూడా లేదనిపించుకుని ఇంటికొస్తొంటే రెండు వేల రూపాయలున్న పర్సు దొరికింది.

ఆ పర్సులో ఆ పర్సు పోగొట్టుకున్న అతని అడ్రసు వుంది. నిజాయితీగా అయితే బాలు వెళ్ళి పర్సు అందజేయొచ్చు కానీ, ఇప్పుడు తనకు బాగా డబ్బు అవసరం వుంది. దొంగతనం చేసైనా సరే డబ్బు సంపాదించాలనే స్థితిలో వుండగా తన అదృష్టం కొద్ది డబ్బున్న పర్సు దొరికింది.

ఏం చెయ్యాలని ఆలోచిస్తే బాలూకు ఓ మోస్తరు ఐడియా తట్టింది. డబ్బు తీసుకుని పర్సులో వున్న కార్డ్స్ అలాగే వుంచి పర్సు పోగొట్టుకున్న అతనికి కొరియర్ చేస్తూ ఓ లెటర్ రాశాడు.

సార్, మీ పర్సు నాకు దొరికింది. కానీ ప్రస్తుతం నాకు డబ్బు అవసరం చాలా వుంది. అంచేత డబ్బు మాత్రం తీసుకుని మీ పర్సునే మీకు కొరియర్ ద్వారా పంపిస్తున్నాను. మీ అడ్రసు నా దగ్గర వుంది. నాకు డబ్బు అడ్జస్ట్ అవగానే మీ డబ్బు మీకు పంపేస్తాను. ప్రస్తుతానికి నేనెవరో మీకు సస్పెన్స్. నేను చేసిన పనికి క్షమించగలరు. కృతజ్ఞులతో ఓ అజ్ఞాత వ్యక్తి.

* * *

ఓరోజు పొద్దున్నే బాలూ రూంకు ఓ వ్యక్తి వచ్చాడు. తనకు దొరికిన పర్సులో కార్డ్స్‌లో వున్న ఫోటోలను బట్టి ఇప్పుడు వచ్చిన వ్యక్తి ఎవరో బాలు వెంటనే గుర్తు పట్టేశాడు. ఆ వచ్చింది పర్సు పోగొట్టుకున్న శాల్తి.

"బాలూ వున్నాడా?" అన్నాడు ఆ వ్యక్తి.

"మీకు నా అడ్రసు ఎలా దొరికింది" ఆశ్చర్యంగా ఒకింత భయంగా అడిగాడు బాలు.

"చెబుతానుగానీ బాలు అంటే మీరేనా?"

"సారీ సార్ డబ్బు చాలా అవసరం వుండి నేనలా చేశాను" అన్నాడు బాలు ప్రాధేయపూర్వకంగా.

"ఫర్లేదు - నేను అందుకోసం రాలేదు. ఇప్పుడు మీకు ఎంత డబ్బు కావాలో చెప్పండి - నేను ఇస్తాను" అన్నాడు.

"అక్కర్లేదండి - ఈ రెండు వేలు తీసుకున్నందుకే చాలా గిల్టీగా వుంది" అన్నాడు బాలు.

"సరే! ఇక నుండి మనం ఫ్రెండ్స్ - ఎప్పుడైనా మీకు డబ్బు అవసరం అయితే మొహమాట పడకుండా నన్ను అడగండి - ఇది నా అడ్రసు" అని కార్డ్ ఇచ్చి వెళ్ళబోతుంటే "సార్" అని బాలు పిలిస్తే ఆగాడు ఆ వ్యక్తి.

"సార్ - నా అడ్రస్సు మీరు ఎలా కనుక్కున్నారు?" కాస్త ఆశ్చర్యంగా అడిగాడు బాలు.

"మీరు నాకు కొరియర్ చేసిన కవర్ మీద అలవాటుగా మీరు మీ ఫ్రం అడ్రస్సు కూడా రాసేశారు" అని అదోలా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు ఆ పర్సు అతను.

అలవాటులో తను చేసిన పొరపాటుకు నవ్వుకున్నాడు బాలు.

-ఎం.గాంధీ (హైదరాబాద్)